సాక్షి నల్లగొండ

సోమవారం ၊ 2 ၊ సెప్టెంబర్ ၊ 2024



ముగిసిన టెన్నిస్ పోటీలు

భువనగిరిలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	: 589.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 4,74,205 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 4,97,524 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 12,261 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 5,292 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: నిల్
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం: 641.60 అడుగులు

ఇన్‌ఫ్లో	: 4,789 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 12.222క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ : భారీగా వర్షాలు కురుస్తుండటంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. శనివారం ఉదయం నుంచే జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో టోల్‌ఫ్రీ నెంబర్ 18004251442 ప్రజలు ఎలాంటి అవసరం ఉన్న పోన్ చేయాలని మంత్రి సూచించారు.

విద్యపై ప్రత్యేక దృష్టి

నల్లగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో పాఠశాల విద్యపై తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం రూపొందించిన రిపోర్ట్‌ను ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆ ఫోరం చైర్మన్ ఎంవీ.గోనారెడ్డి హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో పాఠశాల విద్యపై తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం సమగ్ర సమాచారం రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, స్కూల్ ఎడ్యుకేషనల్ కమిషనర్ నర్సింహారెడ్డి, ఆకునూరి మురళి, వెంకట్‌రెడ్డి, సైంటిస్ట్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, గాలి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డే రద్దు

నల్లగొండ : జిల్లాలో భారీ వర్షాల కారణంగా సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డేను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

చెర్వుగట్టు మూడుగుండ్లపై దర్శనం నిలిపివేత

నార్కట్‌పల్లి : భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మూడుగుండ్లపై దర్శనాన్ని నిలిపివేసినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. సోమవారం అమావాస్య కావడంతో దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

తిప్పర్తి : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ శ్రీనివాస్ ఆదేశించారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. సిబ్బంది సెలవు దినాల్లో కూడా విధులకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ప్రదీప్ బాబు, డాక్టర్ ఇక్తియార్ అహ్మద్, సిబ్బంది పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

దుందుభి జోరు.. డిండిలోకి నీరు

డిండి : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో దుందుభి వాగు పరవళ్లు తొక్కుతోంది. వాగు ద్వారా ఆదివారం తెల్లవారుజాము నుంచే డిండి పాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా ఈ ఏడాది వానాకాలం ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంతో శనివారం వరకు ప్రాజెక్టులో 15 అడుగుల నీటిమట్టం మాత్రమే ఉంది. దుందుభి వాగు ద్వారా 20 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి ప్రాజెక్టులో 30 అడుగులకు చేరిందని ఇరిగేషన్ శాఖ ఏఈ ఫయాజ్ తెలిపారు. వరద కొనసాగితే సోమవారం ఉదయం వరకు ప్రాజెక్టు అలుగు పోయవచ్చునని పేర్కొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభి వాగు





పాగిళ్లలో ప్రకృతి సోయగం

చందంపేట : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చందంపేట మండలంలోని పాగిళ్ల గ్రామంలో ఎత్తయిన కొండల నుంచి జాలువారుతున్న జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎత్తయిన కొండలపై నుంచి జాలువారుతున్న నీటిని వీక్షించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.

సాగర్‌కు భారీగా వరద

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. ఆదివారం కూడా 26 రేడియల్ క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి సాగర్‌కు 4,74,205 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా స్పిల్‌వేమీదుగా 4,97,524 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 12,261 క్యూసెక్కులు మొత్తం దిగువ 5,09,785 క్యూసెక్కులు కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వకు గండి పడటంతో నీటిని నిలిపివేశారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

ఆదివారం సెలవుదినం కావడంతో సాగర్‌కు పర్యాటకులు తరలి వచ్చారు. ఆనకట్టకు దిగువన నదికి ఇరువైపుల పర్యాటకులు నిలబడి కృష్ణమ్మ అందాలను తిలకించారు.

రెండు రోజులుగా లాంచీలు నిలిపివేత

ఎగువ నుంయి వరద తీవ్రత ఎక్కువగా ఉండటం, ఈదురుగాలులకు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతుండటంతో నాగార్జునకొండకు వెళ్లే లాంచీలను నిలిపివేశారు. దీంతో పర్యాటకులు కొంత మేర అసంతృప్తికి గురయ్యారు. వరద ఉధృతి, గాలులు తగ్గితే లాంచీలను నడుపుతామని సంబంధిత అధికారులు తెలిపారు.

ముంచెత్తిన వాన

పొంగిపొర్లిన వాగులు, తెగిన చెరువు కట్టలు, పొలాల్లో ఇసుక మేటలు

- వరదలో చిక్కుకొని కోదాడలో ఇద్దరు మృతి
- రోడ్లపై నీటితో పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- తెగిన సాగర్, మూసీ ఎడమ కాల్వలు
- హైదరాబాద్–విజయవాడ రహదారిపై రాకపోకలు నిలిపివేత

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, నల్లగొండ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది. అతి భారీ వర్షం సూర్యాపేట జిల్లాను అతలాకుతలం చేసింది. సూర్యాపేట జిల్లాలో 443 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా కోదాడ ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లించింది. నాగార్జునసాగర్, మూసీ ఎడమ కాల్వలకు గండ్లు పడ్డాయి. వేల ఎకరాలు నీటి పాలైంది. వరదల్లో చిక్కుకొని కోదాడలో ఇద్దరు మరణించగా, మోతె మండలంలో ఒకరు వరదలో చిక్కుకోగా, జాలర్లు కాపాడారు. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, పలు చోట్ల చెరువుల కట్టలు తెగిపోయాయి. రోడ్లపై వరదనీటి ప్రవాహంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు పలు గ్రామాలను ముంచెత్తగా పలు చోట్ల ఇళ్లు కూలిపోయాయి. పలు చోట్ల రైల్వే లైన్లు దెబ్బతినడంతో మఠంపల్లి మీదుగా పలు ప్యాసింజర్లను దారి మళ్లించారు. కోదాడ మీదుగా హైదరాబాద్–విజయవాడ రహదారిపై రాకపోకలు నిలిపివేసినట్లు పోలీసులు ప్రకటించారు.

సాగర్ ఎడమకాల్వకు రెండు చోట్ల గండి

నాగార్జునసాగర్ ఎడమకాల్వకు సూర్యాపేట జిల్లాలోని నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం 132వ కిలోమీటరు వద్ద, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం శివారు రంగులబ్రిడ్జి వద్ద గండ్లు పడ్డాయి. దీంతో భారీ ఎత్తున సాగర్ నీరు కాగితరామచంద్రాపురం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మండడినర్సాయగూడెం, శీత్లాతండా, ఈశ్వరమాదారం, నడిగూడెం మండలం వల్లాపురం, అనంతగిరి మండలం చనుపల్లి, పాలారం, కిష్టాపురం గ్రామాలను ముంచేసింది. సూర్యాపేట మండలం పిల్లలమర్రి – పిన్నాయిపాలెం మధ్య మూసీ ఎడమకాలువ గండిపడింది. ఈ మూడు సంఘటనల్లో వేల ఎకరాల్లో పంట నీటమునిగింది.

కోదాడలో ప్రాణనష్టం..

కోదాడ పట్టణ సమీపంలోని వాగు వరద నీటిలో కారుతో పాటు మృతదేహం కొట్టుకువచ్చింది. కోదాడ పట్టణం గాంధీనగర్‌కు చెందిన నాగం రవికుమార్ కారులో హుజూర్‌నగర్ రోడ్డులోని వాగు దాటే క్రమంలో కారుతో సహా కొట్టుకుపోయి మరణించినట్లు గుర్తించారు. ఉత్తమ్ పద్మావతినగర్ వద్ద యారమాల వెంకటేశ్వర్లు బైక్‌పై వరద ప్రవాహాన్ని దాటుతూ ప్రమాదానికి గురై మరణించారు. వరదకు బైక్‌లు, కార్లు, ట్రాక్టర్‌లు, లారీలు, పశువులు, వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ కొట్టుకుపోయాయి.



సాగర్ క్రస్ట్ గేట్ల దిగువన ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ



నడిగూడెం మండలం రామచంద్రాపురం వద్ద తెగిన సాగర్ ఎడమకాల్వ కట్ట



తెగిన మూసీ ఎడమకాల్వ కట్ట

విజయవాడ హైవేపై వాహనాల దారి మళ్లింపు

తెలంగాణ– ఆంధ్రా సరిహద్దు కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్‌వద్ద పాలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపైకి వరదనీరు చేరుకుంది. దీంతో అధికారులు హైదరాబాద్–విజయవాడ రహదారిపై అధికారులు రాకపోకలను నిలిపివేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద అద్దంకి రోడ్డు వైపు మళ్లించారు.

498 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు..

నల్లగొండ జిల్లాలో భారీ వర్షాల కారణంగా 498 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లాలోని దామరచర్ల, మాడ్గులపల్లి, వేములపల్లి, గుర్రంపోడు, పెద్దవూర మండలాల్లో వరి 475 ఎకరాల్లో దెబ్బతినగా, పత్తి 20 ఎకరాలు, మిర్చి 3 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు లెక్కలు వేశారు.

మఠంపల్లి మీదుగా ప్యాసింజర్ రైళ్లు..

మహబూబాబాద్ జిల్లాలో రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో పలు రైళ్లను దారిమళ్లించారు. భువనగిరి మండలం పగిడిపల్లి రైల్వేస్టేషన్ నుంచి నడికుడి రైల్వేలైన్ గుంటూరుకి అధికారులు మళ్లించారు. నాందేడ్ నుంచి సంబల్పూర్ వెళ్లే రైలును పగిడిపల్లి రైల్వే స్టేషన్‌లో కొద్దిసేపు నిలిపి అనంతరం పంపించారు. సికింద్రాబాద్ నుంచి భువనగిరి మీదుగా వెళ్లే గౌతమి, గోల్కొండ, కాకతీయ, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. భద్రాచలం – సికింద్రాబాద్ రైలును బీబీనగర్ – నడికుడి మార్గంలో నడిపిస్తున్నారు.

వర్షంతో నష్టం ఇలా..

- మఠంపల్లి మండలం చౌటపల్లిలో ఊరచెరువుకు, హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ చెరువు, మేళ్లచెరువులో నాగులచెరువు కట్టలు తెగిపోయాయి. వేలాది ఎకరాల్లో పంట నీటమునిగింది.
- మోతె మండలం రావిపహాడ్ పెద్ద చెరువు వరదల్లో చేపల చెరువు కాంట్రాక్టర్ తమ్ముడు మాదాసు నరేష్ వరదలో చిక్కుకున్నారు. అతన్ని జాలర్లు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.
- అర్వపల్లి మండలం కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జెడ్పీహెచ్ఎస్, సంత వీధి, ఉమామహేశ్వరస్వామి దేవాలయంరోడ్డు, పోలీస్‌స్టేషన్‌రోడ్, జాజిరెడ్డిగూడెంరోడ్‌లోని ఇళ్లు జలమయమయ్యాయి. కేజీబీవీలోని 200మంది బాలికలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. స్థానిక శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో వసతి కల్పించారు.
- చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలోని ఊర చెరువు కట్ట నాలుగు చోట్ల తెగడంతో వందల ఎకరాల్లో పొలాలు ఇసుక మేట వేశాయి.
- తిరుమలగిరిలో భారీ వర్షం కారణంగా సూర్యాపేట – జనగాం ప్రధాన రహదారిపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది.

శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు నల్లగొండ జిల్లాలో వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (సెం.మీ.)
కేతేపల్లి	17.38
వేములపల్లి	15.30
తిప్పర్తి	15.18
కొండమల్లేపల్లి	13.83
శాలిగౌరారం	13.18
నాంపల్లి	12.08
మునుగోడు	11.55
దేవరకొండ	11.24
గుర్రంపోడు	11.01
అడవిదేవులపల్లి	10.98
నేరెడుగొమ్ము	10.95
తిరుమలగిరిసాగర్	10.85
కనగల్	10.85
చండూరు	10.82
గుండ్లపల్లి	10.80
నల్లగొండ	10.23
నిడమనూరు	10.23
కేతేపల్లి	10.15
త్రిపురారం	9.39
చిట్యాల	9.05
పెద్దవూర	9.03
హాలియా	8.88
మిర్యాలగూడ	8.87
పీఏపల్లి	8.74
దామరచర్ల	7.99
నకిరేకల్	7.33
మర్రిగూడ	6.78
చింతపల్లి	6.37
చందంపేట	5.13
గట్టుప్పల్	3.55
కట్టంగూర్	2.91

కేతేపల్లిలో తప్పిన ప్రమాదం

కేతేపల్లిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో భారీ వర్షాలతో 9 చెట్లు నేలకూలాయి. అర్ధరాత్రి కావడంతో పిల్లలు ఎవరూ లేకపోవడం భారీ ప్రమాదం తప్పింది. నల్లగొండ జిల్లాలో 112 చెరువులు అలుగు పోస్తున్నాయి. నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు నుంచి శాలిగౌరారం వెళ్లేదారిలో కల్వర్టుపై నుంచి నీరు భారీగా రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దేవరకొండ మండలం మునగనూర్ నుంచి చందంపేట వెళ్లే దారిలో వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దేవరకొండ నుంచి డిండి వెళ్లే దారిలో కామేపల్లి వద్ద కాజ్‌వే పొంగి పొర్లుతుండటంతో ప్రజలు అటు వైపు రాకండా పోలీసులు కంపచెట్లను అడ్డు వేశారు. త్రిపురారం మండలం బాబుసాయిపేట వద్ద కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మిర్యాలగూడ పట్టణం మయూరినగర్‌లో ఇళ్లలోకి నీరు చేరింది.

నేడు పాఠశాలలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించిందని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సోమవారం పాఠశాలలు బంద్ కానున్నాయి.

ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలి



నల్లగొండలోకి క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు

నల్లగొండ టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, గెజిటెడ్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ నాగిల్ల మురళి డిమాండ్ చేశారు. ఆదివారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గడియారం సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌పీఎస్ విధానం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఆసరా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జె.శేఖర్‌రెడ్డి, ముజీబుద్దీన్, దామోదర్‌రెడ్డి, శ్రీశైలం, ఏడుదొడ్ల వెంకటరాంరెడ్డి, రాంబాబు, ఎం.రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, నర్రా శేఖర్‌రెడ్డి, అరుణ, రాము, వీరమల్ల శ్రీనివాస్, భద్రయ్య, కృష్ణ, నర్సింహాచారి, వంగూరి విజయకృష్ణ, ఫణికుమార్, నారాయణరెడ్డి, దశరథ, భాస్కర్, లక్ష్మయ్య, సైదులునాయక్, ఆంజనేయులు, దుర్గయ్య, రమణ, శ్రీనివాస్, మనోజ్, ప్రదీప్, వహీద్, భిక్షమయ్య, శ్రీనివాస్, రమ్యసుధ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకలు కరిచినా పట్టని ప్రభుత్వం

- కొండభీమనపల్లి గురుకులాన్ని సందర్శించిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు, పక్కన పేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

దేవరకొండ : గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఎలుకలు కరిచినా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితుల్లో ఉందని మాజీ మంత్రులు హరీశ్‌రావు, మంత్రి గంగుల కమలాకర్, గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, గురుకులాల మాజీ సెక్రటరీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలను ఆదివారం వారు సందర్శించారు. మూడు రోజుల క్రితం పాఠశాల హాస్టల్‌లో నిద్రిస్తున్న 13 మంది విద్యార్థులపై ఎలుకలు దాడి చేయడంతో వారిని పరామర్శించి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గురుకులాలను ఎంతో ప్రతిష్టాత్మంగా తీర్చిదిద్దామని.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో వారంలో ఐదు రోజులు గుడ్డు అందించే వారని ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. జైళ్లలో ఖైదీలకు రోజూ రూ.83 ఖర్చు చేస్తుండగా విద్యార్థులకు మాత్రం రూ.36.75 మాత్రమే ఖర్చు చేయడం ఏంటని ప్రశ్నించారు. గురుకులాల వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకుల పాఠశాలలు, కళాశాల పరిస్థితిపై సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ టూ ఢిల్లీ చక్కర్లు కొట్టడానికే సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. వారి వెంట రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గాదరి కిషోర్ తదితరులు ఉన్నారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



బాలికల పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : వర్షాల కారణంగా పడిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలపై ఆదివారం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. వర్షాల వల్ల రహదారులపై నీరు ప్రవహిస్తున్న చోట రవాణా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యుత్, తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అవసరమైతే తప్ప ప్రజలకు ఇళ్ల నుంచి బయటికు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల జిల్లాలోని రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిరేకల్‌లో గురుకులం పరిశీలన

నకిరేకల్ : వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. నకిరేకల్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల పైఅంతస్తులో వర్షపు నీరు లీకేజీని ఆదివారం ఆయన ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని కిచెన్, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి కిరణ్, ఎంపీడీఓ చంద్రశేఖర్, కమిషనర్ బాలయ్య, తహసీల్దార్ జమీరుద్దీన్, ఏఓ జానిమియా, ప్రిన్సిపాల్ ప్రవంతి ఉన్నారు.

నార్కట్‌పల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో..

నార్కట్‌పల్లి : భారీ వర్షాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సమయంలో నార్కట్‌పల్లి మండలంలో పర్యటిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో నుంచి మంత్రుల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

- ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేథా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆరు నెలల కాలపరిమితి కల్గిన స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ లేదా ఇంటర్ పాసై ఉండాలని అన్నారు. అదేవిధంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజీ క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు 8వ తరగతి విద్యార్హత కల్గి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అభ్యర్థులు 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలని, ఆసక్తి కల్గిన వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 8న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేటి పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్: వర్షాల కారణంగా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరగాల్సిన ఎంఈడీ, ఎల్ఎల్‌బీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఉపేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అయితే మంగళవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథాతథంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని బండసోమారం గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు గురై ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన రైతు నల్లమాస రాజు గౌడ్ వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టివేశాడు. ఒక్కసారిగా పిడుగుపడడంతో ఆవు మృతిచెందింది. దాని విలువ సుమారు రూ.లక్షా20 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

సాగర్ ఎడమ కాలువలో పడి మహిళ మృతి

త్రిపురారం: నిడమనూరు మండలంలోని వేంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం ఓ మహిళ ప్రమాదవశాత్తు నాగార్జునసాగర్ ఎడమ కాలువలో పడి మృతి చెందింది. నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన జిల్లెపల్లి రాములమ్మ గత ఆరు నెలల నుంచి వేంపాడులో తన బంధువుల వద్ద ఉంటోంది. ఆదివారం మిర్యాలగూడకు వెళ్లే సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వేంపాడు వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువలోకి దిగడంతో కాలు జారి అందులో పడింది. అదే సమయంలో చేపలు పడుతున్న స్థానికులు చూసి ఆమెను బయటకు తీసుకురాగా.. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు జిల్లెపల్లి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.



కనగల్ మండలం బుడుమర్లపల్లి గ్రామంలో కూలిన ఇంటి గోడ



హుజూర్‌నగర్‌లోని 15వ వార్డులో ఇంట్లోకి వచ్చిన వరదనీరు



చిలుకూరు: నారాయణపురం - బిక్యాతండా రోడ్డులో విరిగిన విద్యుత్ స్తంభం



కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి స్కూల్ వద్ద కొట్టుకువచ్చిన కారు

తెగిన చెరువు కట్టలు.. రోడ్లు మునిగిన పంటలు

- పలు చోట్ల కూలిన ఇళ్లు
- భారీ వర్షంతో అతలాకుతలం
- కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజక వర్గాల్లో తీవ్ర నష్టం
- వరిపొలాల్లో ఇసుక మేటలు



చిలుకూరు నుంచి దూదియాతండాకు వెళ్లే రహదారిలో రాయికుంట వద్ద తెగిన రోడ్డు



జలమయమైన అర్వపల్లి పశువైద్యశాల



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మానసానగర్‌లో జలమయమైన రోడ్డు



హుజూర్‌నగర్: మఠంపల్లి రోడ్డులో వాగు నీటిలో చిక్కుకున్న లారీ



హుజూర్‌నగర్‌రూరల్: బూరుగడ్డలో తెగిన నల్లచెరువు కట్ట



నూతనకల్: మిర్యాలలో తెగిన ముత్యాలమ్మ కుంట చెరువు కట్ట



నడిగూడెం: రత్నపురం వద్ద చెరువును తలపిస్తున్న వరిపొలాలు



మేళ్లచెరువులోని నాగుల చెరువుకు పడిన గండి



మఠంపల్లి: రఘునాథపాలెం వద్ద వరద ఉధృతికి తెగిపోయిన రోడ్డు



మేళ్లచెరువు మండలం వెంకట్రామాపురం నుంచి బక్కమంతులగూడెం మధ్యలో వరద ధాటికి తెగిన రోడ్డు



అనంతగిరి: వెంకట్రాంపురం వద్ద వరద ప్రవాహం



కోదాడరూరల్: తొగర్రాయిలో కొట్టుకుపోయిన బ్రిడ్జి



తిరుమలగిరిలో సూర్యాపేట -జనగామ రహదారిపై నిలిచిన వర్షపు నీరు



జలమయమైన అర్వపల్లి కేజీబీవీ నుంచి పుస్తకాలు తలపై పెట్టుకుని బయటకు వస్తున్న విద్యార్థులు



హుజూర్‌నగర్ రూరల్: దెబ్బతిన్న బూరుగడ్డ - కరక్కాయలగూడెం రోడ్డు

ముగిసిన అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న అండర్–18 అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ఫైనల్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఫైనల్స్‌లో విజయ సాధించిన క్రీడాకారులు 60 పాయింట్లు సాధించి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మెరుగుపడ్డారు. కాగా ఫైనల్స్ శనివారం జరగాల్సి ఉండగా వర్షం కారణంగా ఆదివారానికి వాయిదా వేశారు. ఆదివారం మధ్యాహ్నం వర్షం కొద్దిగా తెరిపినివ్వడంతో ఫైనల్స్ నిర్వహించారు. ఫైనల్స్‌లో బాలికల సింగిల్స్ విభాగంలో స్నిగ్ధ కాంత(ఇండియా), బాలురు విభాగంలో శంకర్ హిస్నమ్(ఇండియా), బాలికల డబుల్స్ విభాగంలో దియా రమేష్, సోహిని సంజయ్ మొహంతి(ఇండియా), బాలురు డబుల్స్ విభాగంలో సెహజ్ సింగ్ పవార్, వరుణ్ వర్మ(ఇండియా) విజయం సాధించారు. విజేతలకు సాయంత్రం షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, ఐటీఎఫ్ సూపర్‌వైజర్ శివకుమార్‌రెడ్డి, సుభాస్‌రెడ్డి పాల్గొన్నారు.



విజేతలతో టెన్నిస్ అసోసియేషన్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నేటి నుంచి వెటరన్ టోర్నమెంట్..

ఐటీఎఫ్ వెటరన్ టోర్నమెంట్ సోమవారం నుంచి ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 35 నుంచి 75 ఏళ్ల వయస్సు వరకు గల కేటగిరీల్లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. పలు దేశాలకు చెందిన సుమారు 70 క్రీడాకారులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మూసీ ఐదు గేట్ల ఎత్తివేత

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికారులు ఆదివారం ఐదు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా.. ప్రస్తుత నీటిమట్టం 641.60 అడుగుల (3.60 టీఎంసీలు) మేర ఉంది. ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువ నీటిని నిలిపివేశారు. ప్రాజెక్టులోకి 4,789 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. గేట్ల ద్వారా 12,222 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



మూసీ ప్రాజెక్టు ఐదు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

పులిచింతలకు 6.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు సాగర్, టెయిల్‌పాండ్‌ల నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. శనివారం 3,39,434 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం 6,05,120 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టులోని 21 గేట్ల ద్వారా 5,63,451 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 41.98 టీఎంసీల నీరు ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- అమెరికా నుంచి వస్తున్న స్నేహితుడిని కలిసేందుకు వెళ్తుండగా ఘటన

సూర్యాపేటటౌన్: అమెరికా నుంచి వస్తున్న స్నేహితుడిని రిసీవ్ చేసుకునేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం అర్ధరాత్రి 1.30గంటల సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూర్‌కు చెందిన కొరిక విజయభాస్కర్ కుమారుడు కొరిక అభిషేక్(21), అతడి మిత్రులు జీవన్, సాయికిరణ్, దుర్గాప్రసాద్(పండు) కలిసి తమ స్నేహితుడు అమెరికా నుంచి వస్తుండడంతో అతడిని రిసీవ్ చేసుకునేందుకు కారులో శనివారం రాత్రి హైదరాబాద్‌కు బయల్దేరారు. దుర్గాప్రసాద్ డ్రైవింగ్ చేస్తున్నాడు. మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ సమీపంలో విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై బారికేడ్స్‌ను అతివేగంతో ఢీకొట్టడంతో అభిషేక్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. మృతుడి తండ్రి విజయభాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

తెగిన నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్ట

నడిగూడెం: మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామ సమీపంలో సాగర్ ఎడమ కాల్వ కట్ట రెండు చోట్ల తెగింది. ఓ వైపు సాగర్ నీరు, మరో వైపు పాలేరు రిజర్వాయర్ నుంచి బ్యాక్‌వాటర్ ఉధృతంగా కాల్వలోకి రావడంతో కట్ట తెగింది. దీంతో వరద నీరు కాగితరామచంద్రాపురం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మందడినర్సయ్యగూడెం, శీల్లితండా, ఈశ్వరమాదారం, నడిగూడెం మండలం వల్లాపురం, అనంతగిరి మండలం చనుపల్లి, పాలారం, కిష్టాపురం, శాంతినగర్ గ్రామాల పరిధిలోని పాలేరు వాగు వెంట ఉన్న దాదాపు 500 ఎకరాలకు పైగా వరి పొలాలు, 200లకు పైగా విద్యుత్ మోటార్లు నీట మునిగాయి. సూర్యాపేట, ఖమ్మం జిల్లాల సరిహద్దు అయిన కాగితరామచంద్రాపురం, మందనర్సయ్యగూడెం గ్రామాల మధ్య వరద ఉధృతి కొనసాగుతుండడంతో రాకపోకలు నిలిచాయి. లోతట్టు గ్రామాల ప్రజలను పోలీసులు అప్రమత్తం చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడి సంఘటనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాల్వకట్ట తెగిన ప్రాంతాన్ని ఎస్పీతోపాటు మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఇమామ్, ఎస్ఐ అజయ్ కుమార్, ఎంపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి పరిశీలించారు.

ఉలక వాగులో కొట్టుకుపోయి ఇద్దరు మృతి

కోదాడ: భారీ వర్షాలకు కోదాడ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉలక వాగులో కొట్టుకుపోయి మృతిచెందారు. కోదాడ పట్టణంలోని ఉత్తమ్ పద్మావతినగర్‌కు చెందిన యరమాల వెంకటేశ్వర్లు (53) శనివారం రాత్రి స్థానికంగా ప్రవహిస్తున్న ఉలక వాగును దాటుతుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. ఆదివారం ఉదయం అతడి మృతదేహాన్ని అధికారులు, బంధువులు సమీపంలో గుర్తించారు. అదేవిధంగా కోదాడ పట్టణంలోని ఆజాద్ నగర్‌కు చెందిన నాగం రవికుమార్ ఉలక వాగును కారులో దాటుతుండగా కారుతో పాటు గల్లంతయ్యాడు. ఉదయం వాగులో నుంచి కారును బయటకు తీస్తుండగా రవికుమార్ కారులోనే మృతిచెంది ఉన్నాడు. ఇరువురి మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



కారులోనే మృతి చెందిన నాగం రవికుమార్



యరమాల వెంకటేశ్వర్లు (ఫైల్)

నీటి ప్రవాహంలో చిక్కుకున్న ఆరుగురు

- జాలర్ల సాయంతో కాపాడిన పోలీసులు

కోదాడ: పాలేరు నీటి ప్రవాహంలో చిక్కుకున్న ఆరుగురిని కోదాడ డివిజన్ పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి కాపాడారు. ఆదివారం రాత్రి పాలేరు నదికి వరద ఉధృతి పెరగడంతో కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం వద్ద ఉన్న కోళ్ల ఫారంలోకి వరద నీరు చేరింది. అక్కడ పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడకు చెందిన ఇద్దరు పురుషులు, ఇద్దరు స్త్రీలు, మరో ఇద్దరు పిల్లలు వరద నీటిలో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న సూర్యాపేట ఏఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, రూరల్ సీఐ రజితారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఎస్ఐ అనిల్‌రెడ్డి అక్కడి చేరుకున్నారు. కోదాడ పెద్దచెరువు సంఘం అధ్యక్షుడు కందరబోయిన వీరస్వామి ద్వారా ఇద్దరు జాలర్లను, తెప్పలను తెప్పించి కోళ్లఫారం వద్దకు పంపించి అక్కడ ఉన్న కూలీలు వారి పిల్లలు నలబాపన శ్రీను, రమాదేవి, హరిత, వినీల, వాస్తవ్య, పోతర్ల శ్రీనివాస్‌లను సురక్షితంగా బయటకు తీసుకువచ్చి కోదాడలోని పునరావాస కేంద్రానికి పంపించారు.



బాధితులతో ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ, పోలీస్ సిబ్బంది